సాక్షి తిరుపతి

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



**జాతీయ సదస్సు విజయవంతానికి కృషి**

జాతీయ సదస్సు విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. - 8లో



**మెరుగైన వసతులు కల్పిస్తాం**

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. - 8లో



**ప్రయాణికుల కష్టాలు**

అనంతపురంలో బుధవారం జరిగే సీఎం సభకు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. - 8లో

## న్యూస్‌రీల్

### టీటీడీ ఈవోగా నేడు అనిల్ కుమార్ సింఘాల్ బాధ్యతల స్వీకరణ

**తిరుమల :** టీటీడీ ముఖ్య పరిపాలనాధికారిగా (ఈవో) అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 11.00 నుంచి 11.30 మధ్య శ్రీవారిని దర్శించుకుని ఆలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో మూడు సంవత్సరాల ఐదు నెలలపాటు ఈవోగా పనిచేసి పలు సంస్కరణలు తీసుకొచ్చి ప్రశంసలు అందుకున్నారు. స్లాటెడ్ సర్వదర్శనం, శ్రీవాణి ట్రస్ట్, నారాయణగిరి గార్డెన్స్లో షెడ్స్ ఏర్పాటు, టీటీడీలో ఈ ఫైలింగ్ విధానం గరుడ వారధి పనులు సింఘాలే ప్రారంభించారు. టీటీడీ చరిత్రలో రెండవసారి ఈవోగా పనిచేసే అవకాశం సింఘాల్‌కే దక్కింది. బాధ్యతల స్వీకరణ అనంతరం టీటీడీ అధికారులతో సమావేశమై రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించే అవకాశం ఉంది.

### 15 నుంచి ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు

**తిరుపతి సిటీ :** ఇంటర్మీడియట్ 2025–26 సంవత్సరానికి సంబంధించి పరీక్షల ఫీజు చెల్లింపునకు ఇంటర్మీడియట్ బోర్డు తేదీలను ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫీజు చెల్లించాలని కళాశాలలకు ఆదేశాలు జారీ చేసింది. అపరాధ రుసుముతో వచ్చేనెల 21 వరకు గడువు విధించింది. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఏడాదికి థియరీ అండ్ ప్రాక్టికల్స్‌తో కలిపి ఒక్కో విద్యార్థికి రూ. 875 చెల్లించాల్సి ఉంటుంది.

### డిగ్రీ సీట్ల కేటాయింపు నేడు

**తిరుపతి సిటీ :** ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యానికి విద్యార్థులు బలవుతున్నారు. ఆదివారం రోజు డిగ్రీ ప్రవేశాల జాబితా విడుదల చేయాల్సిన అధికారులు ఇప్పటి వరకు విడుదల చేయకుండా వాయిదా వేస్తూ విద్యార్థులకు నరకం చూపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మొట్టికాయులు తిన్న ఉన్నత విద్యా మండలి వ్యవహారశైలిలో మార్పు రాలేదు. రెండు రోజులుగా ఎదురు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపుతోంది. ఉన్నత విద్యామండలిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో స్పందించిన అధికారులు బుధవారం సీట్ల కేటాయింపు నిర్వహిస్తామని తెలిపారు.

### స్కేటింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు రేపు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఈనెల 11వ తేదీ తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో స్కేటింగ్ అండర్–11, 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఆ మేరకు స్కేటింగ్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో నిర్వహించనున్న ఎంపిక పోటీలకు హాజరయ్యే స్కేటర్లు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధారు, ఇంటర్ చదివే వారు పదో తరగతి ఒరిజినల్ మార్క్‌లిస్ట్ తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 81210 81089, 99855 33560 నంబరులలో సంప్రదించాలని ఆయన కోరారు.

### తుడా ఫ్లాట్స్ వేలం ప్రారంభం

**తిరుపతి తుడా:** రేణిగుంట తిరుపతి హైవే పద్మావతి నగర్‌లోని సూరప్పకశం తుడా లేఅవుట్‌లోని తుడా స్థలాలను ఈ వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈ నెల 4న ప్రారంభమైన ఈ వేలం 17వ తేదీతో ముగియనుంది. సుమారు 277 ప్లాట్లు అమ్మకానికి ఉంచారు. ఇప్పటివరకు 35 ప్లాట్స్ అమ్మకం జరగగా దాదాపు రూ.13 కోట్లు తుడాకు ఆదాయం లభించింది. ఈ వేలం ప్రక్రియను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చదరపు గజం రూ.14 వేలుగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.



తిరుపతిలో నిరసన ర్యాలీగా వస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, మేయర్ శిరీష, చంద్రమౌళిరెడ్డి పాటు రైతులు, పార్టీ శ్రేణులు (ఇన్‌సెట్) వరి పైరు, యూరియా మూటలతో ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు, రైతులు

# రైతు గర్జన

- రైతులతో కలిసి కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ నేతలు
- ఆర్డీఓ కార్యాలయాలకు రైతులతో కలిసి ర్యాలీ
- తిరుపతిలో వైఎస్సార్‌సీపీ వినూత్న నిరసన
- వరి కంకులు, యూరియా బస్తాల ఫ్లెక్సీలతో ర్యాలీ
- గూడూరులో అడుగడుగునా పోలీసుల ఆంక్షలు
- సూళ్లూరుపేటలో పోలీసుల ఓవరాక్షన్

**సాక్షి ప్రతినిధి, తిరుపతి :** కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి కదం తొక్కారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు. వేరుశనగ విత్తనాలు, వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని, పంటలకు ఉచిత బీమా అమలు చేయాలంటూ మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతి పత్రాలు సమర్పించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**కాళ్లు పట్టుకుంటాం.. సమస్యలు పరిష్కరించండయ్యా**

తిరుపతి నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద వినూత్న తరహాలో నిరసన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు వరి కంకులు, యూరియా బస్తాల ఫ్లెక్సీలు చేతపట్టి అన్నమయ్య కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో రైతు భరోసా కేంద్రం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అందులో ఖాళీగా కూర్చుంటే ఎరువు, విత్తనాల కోసం రైతులు వారి కాళ్లుపట్టుకుని వేడుకుంటారు. అయితే ఎరువులు, విత్తనాలు, పథకాలు లేవంటూ అధికారుల వేషధారణలో ఉన్న వారు సమాధానం ఇస్తే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వినూత్నంగా నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించి రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ విన్నవించారు. కార్యక్రమంలో తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రైతు సమస్యలు పరిష్కరించండి**

శ్రీకాళహస్తిలో తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్రీకాళహస్తి, సత్యవేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల, రైతులు శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న అధికారిణికి వినతి పత్రం సమర్పించారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యల గురించి భూమన కరుణాకరరెడ్డి ఆమెకు వివరించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సత్యవేడుకు చెందిన బీరేంద్రవర్మ, మాధవి పాల్గొన్నారు.

**అడుగడుగునా అడ్డంకులు**

గూడూరు, వెంకటగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు మెరుగ మురళీధర్, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరుకు రైతులు భారీగా తరలివచ్చారు. గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీ చేపట్టగా పోలీసులు అడ్డుకోవడంతో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు గూడూరు టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. పోలీసులు అడుగడుగునా అడ్డుపడుతుండటంతో అంతాకలిసి నేరుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవటంతో కార్యాలయ ఏవోకు వినతి పత్రం ఇచ్చారు.

### శ్రీకాళహస్తిలో పోలీసుల ఆంక్షలు



పోలీసుల పహారా

**శ్రీకాళహస్తి:** వైఎస్సార్‌సీపీ రైతు పోరుబాట సందర్భంగా మంగళవారం ఉదయమే వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పోలీసులు దిగ్బంధం చేశారు. ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లకూడదని 30 యాక్టు అమల్లో ఉందని పోలీసులు హడావుడి చేశారు. సోమవారం ఉదయం పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం ఇచ్చేందుకు పోలీసుల అనుమతి కోరారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల నుంచి అందరినీ పిలిచిన తరువాత రాత్రి 9 గంటలకు పోలీసులు తీరిగ్గా ర్యాలీ నిర్వహించకూడదని నేరుగా ఆర్డీవో కార్యాలయానికి రావాలని అనేక ఆంక్షలు పెట్టారు. రెండు నియోజకవర్గాల నుంచి వచ్చిన జనం పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లడానికి అనుమతి లేదని ఆటంకాలు కల్పించారు. అత్యధిక సంఖ్యలో వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు, రైతులు కిలోమీటరు దూరం కూడా లేని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లడానికి అడ్డుపడ్డారు. అడుగడుగునా పోలీసులు డ్రోన్లు, కెమెరాలు, ఫోన్లలో వైఎస్సార్‌పీ నాయకులను ఫొటోలు, వీడియోలో తీస్తూ ఇబ్బందులకు గురిచేశారు. స్థానిక టీడీపీ నాయకులకు వాటిని చేరవేశారు.



శ్రీకాళహస్తి, సత్యవేడు రైతులతో కలిసి ర్యాలీగా వస్తున్న భూమన కరుణాకరరెడ్డి, రాజేష్, పార్టీ శ్రేణులు



నగరిలో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

### సూళ్లూరుపేటలో ఫ్లెక్సీలు చించివేసిన పోలీసులు

మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో నిర్వహించిన ర్యాలీని పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఎవరికి వారు హోలీ క్రాస్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీ చేపట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని ఫ్లెక్సీలను చించివేశారు. ఆ సమయంలో కొంత సేపు పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం నేరుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. రైతు సమస్యలపై ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గూడూరు : నిరసన వ్యక్తం చేస్తున్న నేదురుమల్లి , మేరిగలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సూళ్లూరుపేట : హోలీక్రాస్ సర్కిల్ నుంచి ప్లకార్డులు చేత పట్టుకుని ఆర్డీవో కార్యాలయానికి వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



యూరియా అందించండి సార్ అంటూ తిరుపతిలో అధికారుల కాళ్లు పట్టుకుని వేడుకుంటున్న రైతు నిరసన ప్రదర్శన

**యూరియా కొరతను ముఖ్యమంత్రే ఒప్పుకున్నారు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి యూరియా అందుబాటులో ఉంచండి అని చెబుతున్నారు. అంటే యూరియా కొరత ఉందని ఆయనే ఒప్పుకున్నారు. రైతులకు అవసరమైనత యూరియా అందించకుండా కూటమి నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలించి లబ్ధి పొందుతున్నారు. సుమారు 7 లక్షల టన్నులు నిల్వ ఉంచాల్సిన యూరియాను నిల్వ ఉంచకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో రైతులు రోడ్లపై రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు యూరియా ఎక్కువ వాడకూడదని కలెక్టర్ల ద్వారా ప్రచారం చేయించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రం యూరియా కొరతతో ఇబ్బందులు పడుతుంటే తమపై దుష్ప్రచారం చేస్తుందంటూ ప్రతికారంతో టీడీపీ నాయకులు రగలిపోతున్నారు.

– భూమన కరుణాకర రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు

**రైతు సంక్షేమం పట్టదా?**

గత ఐదేళ్ల జగనన్న పాలనలో రైతులు ఏనాడూ సమస్యలపై రోడెక్కలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏడాదిన్నరకే అష్టకష్టాలు అనుభవిస్తున్నారన్నారు. నాడు గిట్టుబాటు ధర లేక రోడ్డెక్కితే నేడు రాష్ట్రంలోని రైతులందరూ ఎరువులు, యూరియా లేక రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని రైతులను, వారికి అండగా నిలబడే వైఎస్సార్‌సీపీ నేతలను కేసులు పెడతామంటూ బెదిరింపులకు గురిచేస్తోంది. ఎరువులు, యూరియా పుష్కలంటే ఉంటే రైతులు మండుటెండల్లో ఎందుకు క్యూలో నిలబడతారు. చంద్రబాబు, పవన్‌కు రైతు సంక్షేమం పట్టదా..?.

– ఆర్కే రోజా, మాజీ మంత్రి

**చంద్రబాబు రైతు వ్యతిరేఖి**

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతుల పట్ల వివక్ష చూపుతారు. వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబుకు రైతుల పట్ల చిత్తశుద్ధి ఏ పాటిగా ఉందో యూరియా సరఫరాలోనే అర్థమవుతోంది.

– భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త

**రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ**

రైతుల పట్ల చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

– చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

**అన్నదాత అవసరాలు పట్టించుకోరా?**

అన్నం పెట్టే రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు కూడా పంపిణీ చేయాలేని స్థితిలో ప్రభుత్వం ఉందంటే సిగ్గుచేటు రైతులకు అవసరమైన యూరియాను వెంటనే తేవాలి.

– సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

**కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలి**

చిత్తూరు జిల్లాలో మామిడి కాయలను రోడ్డుపై పారవేసిన పరిస్థితిని మర్చిపోతే ఎలా? నేడు వరి పుట్టి ధర కేవలం రూ.12 వేలు అంటే రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదు.

– మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

**రైతులకు అండగా ఉంటే అడ్డుకుంటారా?**

ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళుతుంటే అడ్డుకోవడం సిగ్గుచేటు. ప్రభుత్వం రైతుల వెన్ను విరిచి విధంగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది.

– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే

**సమస్యలపై ప్రశ్నిస్తే భయమెందుకో?**

కూటమి ప్రభుత్వ పాలనలో నెలకొంటున్న సమస్యలపై ప్రశ్నిస్తే కూటమి ప్రభుత్వంలోని పెద్దలకు భయమెందుకో అర్థం కావడం లేదు.

– నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త

**రైతులను మోసం చేయడమే బాబు లక్ష్యం**

రైతులను మోసం చేయడమే లక్ష్యంగా బాబు పాలన కొనసాగిస్తున్నారు. ఎరువులు అందుబాటులో ఉండవు.

– నూకతోటి రాజేష్, సత్యవేడు సమన్వయకర్త



# నేడే పోలేరమ్మ జాతర



కుమ్మరింట కొలువైన పోలేరమ్మ(ఫైల్)



ఆలయం వద్ద కొలువైన అమ్మవారు (ఫైల్)

**వెంకటగిరి (సైదాపురం):** వెంకటగిరి పట్టణం జాతరకు సిద్ధమైంది. పోలేరమ్మ ఆలయం వేడుకలకు ముస్తాబైంది. అమ్మవారి సేవకు భక్తజనం తరలి వస్తోంది. బుధవారం రాత్రి నగరోత్సవానికి ఉత్సాహంగా ఎదురుచూస్తోంది. ప్రత్యేక రథంపై కొలువుదీరనున్న అమ్మలగన్న అమ్మను కనులారా వీక్షించేందుకు ఎదురుచూస్తున్నారు. బుధ, గురువారాల్లో అత్యంత వైభవంగా జరిగే జాతరకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టింది. వెంకటగిరి పట్టణమంతా విద్యుత్ దీపకాంతులతో శోభిల్లుత్తోంది. పోలేరమ్మ తల్లి బుధవారం రాత్రి జీనుగుల వారి వీధి నుంచి ప్రత్యేక రథంపై నగరోత్సవంగా అమ్మవారి ఆలయం వద్ద చేరుకొని కొలువుదీరనున్నారు. అనంతరం భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాష్ట్ర పండుగ హోదాలో జాతరను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన, డీఎస్పీ గీతాకుమారి అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

**పుట్టింటి నుంచి మెట్టినింటికి వెళ్లనున్న పోలేరమ్మ తల్లి**

జాతర సంప్రదాయాలకు అనుగుణంగా కుమ్మరింట పోలేరమ్మ తల్లిని ఆడపడుచుగా భావిస్తారు. బుధవారం రాత్రి కుమ్మరులు పుట్ట మట్టిని తీసుకొచ్చి అమ్మవారి ప్రతిమను తయారు చేసి మొదటి పూజ అక్కడే చేస్తారు. ఆ రోజు రాత్రి భక్తుల దర్శనార్థం రాత్రి 10.30 గంటల వరకు ఉంచుతారు. ఆ సమయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతారు. అనంతరం కాంపాళెంలోని గాలిగంగుల వద్ద తొలుత పూజలు చేసి అమ్మవారిని కుమ్మరింట నుంచి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధికి తీసుకెళ్తారు. అక్కడ రజకులు పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మెట్టినింటికి ఆహ్వానం పలుకుతారు. అమ్మవారి ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క పెట్టి బంగారు ఆభరణాలు అలంకరిస్తారు. అనంతరం రథంపై అమ్మవారిని ఆలయం వద్దకు చేర్చి కొలువు దీరుస్తారు. (నిలుపు) ఈ తంతు మొత్తం బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు కొనసాగుతుంది. అనంతరం అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పిస్తారు.



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం



విద్యుద్దీప కాంతులతో ఆర్చి

**ప్రతి ఇంటా పూజలు**

**వెంకటగిరి రూరల్:** బుధవారం ఉదయం నుంచే ప్రతి వీధిలో ''పోలేరమ్మకు మడి బిక్షం పెట్టండి. పోతురాజుకు టెంకాయ కొట్టండి'' అంటూ భక్తుల నినాదాలతో హోరెత్తనుంది. ప్రతి ఇంట్లో పసుపు ప్రతిమను తయారుచేసి పూజలు చేస్తారు. అంబలిని నైవేద్యం సమర్పిస్తారు. పోలేరమ్మతల్లి దర్శనార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఉచితం తోపాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూలను ఏర్పాటు చేశారు. వెంకటగిరి జన జాతరకు బుధ, గురువారాల్లో లక్షలాది మంది తరలిరానున్నారు.

## క్లుప్తంగా

### గ్రావెల్ లారీ అడ్డగింత


పోలీసులకు అప్పగించిన గ్రావెల్ లారీ

పెళ్లకూరు : మండలంలోని శిరసనంబేడులో మంగళవారం గ్రావెల్ తరలిస్తున్న లారీలను గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని సర్వే నంబరు 287–2బీలో వేలూరు శ్రీనివాసులురెడ్డి, వేలూరు రాధాకృష్ణారెడ్డి, వేలూరు ప్రభాకర్‌రెడ్డికి 8 ఎకరాల పట్టా భూములున్నాయి. అయితే ఇక్కడి భూములను మెగా కంపెనీకి రోడ్డు అభివృద్ధి పనుల కోసం లీజుకు కేటాయించారు. పనులు పూర్తి కావడంతో లీజు సమయం ముగించుకొని కంపెనీ యంత్రాలు తీసుకెళ్లిపోయారు. అయితే గ్రామానికి చెందిన ఓ నాయకుడు అక్కడ మిగిలిపోయిన స్క్రాప్‌తో పాటు సంబంధిత భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీలతో తరలిస్తున్నారు. దాంతో భూయజమానులు, గ్రామస్తులు కలిసి గ్రావెల్ లారీలను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. అదే సమయంలో గ్రామంలోని రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకొని స్వల్ప దాడులకు పాల్పడ్డారు. ఇరు వర్గాలు పోలీసులను ఆశ్రయించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీలను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న మహిళలు

రేణిగుంట : మండలంలోని పిల్లపాల్యం సమీపంలో రెండు మూడు నెలలుగా రాత్రీ, పగలు తేడా లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై విసుగెత్తిపోన పిల్లపాల్యం మహిళలు మంగళవారం ఉదయం రోడ్డెక్కారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఆపాలని ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇంతలో కూటమి నాయకులు ఉలిక్కిపడి ఎక్కడ పెద్ద ఇష్యూ అవుతుందేమోనని గ్రామంలోని పెద్ద మనుషులతో చర్చించి హుటాహుటిన మహిళలను వెనక్కి పిలిపించారు. ఏదైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందామని చెప్పి మహిళలను పంపించి వేశారు. విషయం బయటకు తెలియకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం.

### బార్ వద్దు..భద్రత కావాలని మహిళల నిరసన


నిరసన తెలుపుతున్న స్థానిక మహిళలు

తొట్టంబేడు : శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్ ఆర్చీ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని (బార్) వద్దు అంటూ స్థానికంగా ఉన్న మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మద్యం దుకాణం వద్దు.. మహిళలకు రక్షణ కావాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ...ఈ ప్రాంతంలో మద్యం దుకాణం (బార్) ఏర్పాటు చేస్తే మహిళలకు రక్షణ కరువుతుందని, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేశారు.. ఈ దుకాణం రద్దు చేసే వరకు ప్రతిరోజు నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

# ఫీజు బకాయిలపై కన్నెర్ర

- ప్రభుత్వానికి ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం అల్టిమేటం!
- పెండింగ్ బకాయిల జాప్యంపై పోరాటానికి అసోసియేషన్ సన్నద్ధం
- పోరాట కార్యాచరణకు సిద్ధమైన ఏపీ ప్రైవేటు కళాశాలల అసోసియేషన్



తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వంపై ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కన్నెర్ర చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక భరించలేం.. తాడో పేడో తేల్చుకుంటామంటూ అల్టిమేటం జారీ చేసింది. రెండేళ్లగా జిల్లాలోని సుమారు 108 ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ఇప్పటి వరకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఒక్క రూపాయి అందకపోవడంతో యాజమాన్యాలు ప్రభుత్వంపై తుది పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా ప్రైవేటు యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో తుది పోరుకు సిద్ధమవుతూ మంగళవారం అన్ని కళాశాల యాజమాన్యాలను అప్రమత్తం చేశాయి.

### కళాశాలలను మూత వేయమంటారా...!

జిల్లాలోని ప్రైవేటు కళాశాలలకు ఇప్పటి వరకు సుమారు రూ.650 కోట్లు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించాల్సి ఉందని యాజమాన్యాలు వాపోతున్నాయి. అంటే ఒక్కో కళాశాలకు సుమారు రూ. 3కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అసోసియేషన్ డిమాండ్లు ఇవే....

- 2023 నుంచి 2025 ఏడాది వరకు పెండింగ్ ఆర్టీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలి
- డిగ్రీ ఫీజులను సవరించి, కొత్త ఫీజుల విధానాన్ని వర్సిటీలకు అప్పగించాలి
- డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలలో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలి
- కళాశాలలకు అఫ్లియేషన్ 5 ఏళ్లకు ఒకసారి ఇవ్వాలి
- ప్రతి ఏడాది అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసి అమలు చేయాలి
- రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో కామన్ అఫిలియేషన్ అమలు చేయాలి

### కళాశాల మనుగడ ప్రశ్నార్థకమే



జిల్లాలో ప్రైవేటు కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కోట్లలో బకాయిలు ఉండటంతో కళాశాల నిర్వహణ భారమవుతోంది. అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో జిల్లాలోని వందల కళాశాల యాజమాన్యాలు సతమతమవుతున్నాయి. అడ్మిషన్ల విషయంలో ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యం వహించడంతో ప్రవేశాలు 50శాతం సైతం దాటడం లేదు. సాధారణ కళాశాలలు మూతపడే అవకాశం ఉంది. తక్షణం ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆదుకోవాలి. లేదంటే రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధర్వంలో తుది పోరుకు సిద్ధమవుతాం.

– పట్నం సురేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్, ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్

### హథీరాంజీ మఠం పునర్నిర్మాణానికి కృషి

తిరుపతి కల్చరల్ : తిరుపతి గాంధీ రోడ్డులో ఉన్న హథీరాంజీ మఠం బంజారాలకు ఎంతో సెంటిమెంట్‌గా ఉందని, ఈ భవనాన్ని పరిస్థితులకు అనుగుణంగా పునర్నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేస్తామని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారు నాయక్ తెలిపారు. హథీరాంజీ మఠం భవనాన్ని పరిరక్షణ సమితి నేతలతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈమేరకు హథీరాంజీ మఠం విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తద్వారా మఠం పరిరక్షణతో పాటు మఠం ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకునేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి అధ్యక్షుడు అమృనాయక్, టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక సుబ్బయ్య, వెంకటరమణ నాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

# తప్పుడు నివేదికలు ఇస్తే చర్యలు : కలెక్టర్

- రేణిగుంట ఈవోపీఆర్‌డీని సస్పెన్షన్‌కు ఆదేశాలు


పీజీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఏదైనా అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే తప్పుడు నివేదికలు కాకుండా వాస్తవ సమాచారంతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో పీజీఆర్ఎస్‌తో పాటు పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అలాగే సంఘటనలకు సంబంధించి నిర్లక్ష్యంగా తప్పుడు నివేదికలు ఇస్తే తక్షణమే చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రేణిగుంట మండలంలో డయేరియాతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో రేణిగుంట ఈవోపీఆర్‌డీని సస్పెండ్ చేయాలని డీపీవో సుశీలాదేవిని ఆదేశించారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఈఈ నరేంద్రను ఆదేశించారు. స్థానిక వీఆర్వోపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఎంలతోపాటు వైద్య బృందం నుంచి శుక్రవారం లోపు నివేదిక పంపాలని ఆదేశించారు, అలాగే ఈ- క్రాప్ వేగవంతం చేయాలని, యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని డీఏవో ప్రసాద్‌రావును ఆదేశించారు.

# జాతీయ సదస్సు విజయవంతానికి కృషి

- ఈనెల 14,15న తిరుపతి వేదికగా సదస్సు
- సచివాలయ ఉద్యోగులకు అవగాహన


సమావేశానికి హాజరైన సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : తిరుపతి వేదికగా తొలిసారి నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సును విజయవంతం చేయడానికి సకల వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం 300 మంది సచివాలయ ఉద్యోగులకు సదస్సులో చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి లైజన్ అధికారులకు సదస్సు నిర్వహణకు చెందిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు లైజన్ అధికారులకు వ్యవహరించాల్సి ఉంటుందని...14,15 తేదీల్లో తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు చైర్మన్‌గా దగ్గుపాటి పురందేశ్వరి వ్యవహరిస్తారని చెప్పారు. హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అప్పగించారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ప్రోటోకాల్) శివశంకర్ నాయక్, సచివాలయ ఉద్యోగులు (లైజన్) పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తాం

- ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు


రాపూరు డిపోలో ఉత్తమ డ్రైవర్ నరసింహులుకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఆర్టీసీ ఎండీ

రాపూరు : రాష్ట్రంలోని ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అన్నారు. రాపూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉత్తమ ఉద్యోగుల సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ బస్టాండుల్లో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో కార్గో సర్వీసులో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్గో సర్వీసును ఇంకా అభివృద్ధి చేయాలని కోరారు. బస్సుల్లో 100 మంది కంటే ఎక్కువ మందిని ఎక్కించవద్దని ఆదేశించారు. రాష్ట్రానికి కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1050 బస్సులు ఉన్నాయని మరో 300 బస్సులు వస్తాయని, అవికాక మరో 1500 బస్సులు అవసరమని ఆయన చెప్పారు. బస్సులు ఎక్కడా ఆగకుండా కొత్త టైర్లు, అవసరమైన సామాగ్రిని అందించాలని మెకానిక్‌లు బస్సును కండీషన్‌లో పంపాలని సూచించారు, అనంతరం రాపూరు ఆర్టీసీ డిపోలో అత్యధికంగా మైలేజ్ తీసుకొచ్చిన డ్రైవరు నరసింహులు, కరిముల్లాను , కండక్టర్లు వెంకటేశ్వర్లు, సంపూర్ణను అభినందించి నగదు , ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే మెకానిక్ సుధాకర్, చాన్‌భాషా, ఆర్టీసీ ఆఫీస్ సిబ్బంది రహీం, హరిబాబుకు ప్రసంసా పత్రాలు , నగదును అందించారు.అనంతరం ఆర్టీసీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఈడీ నాగేంద్రప్రసాద్, ఆర్ఎం షమీం, డీఎం అనిల్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : కలెక్టర్

తిరుపతి అర్బన్ : వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యబృందంతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను, నర్సింగ్ హోమ్స్, వైద్యులు, అనుమతి లేకుండా నడుపుతుంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, డీఐఓ డాక్టర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 104 వాహన డ్రైవర్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..


డక్కిలి పీహెచ్‌సీ వైద్యాధికారులతో విచారణ చేస్తున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ

డక్కిలి : డక్కిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తిరుపతి జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అండ్ టీబీ అధికారి , జిల్లా అదనపు డీఎం అండ్ హెచ్‌ఓ అధికారిణి డాక్టర్ శైలజ మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 9న మంగళవారం అర్ధరాత్రి మందులు మాయం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. దీనిపై జిల్లా డీఎంహెచ్‌ఓ ఆదేశాలు మేరకు అదనపు డీఎంహెచ్‌ఓ పీహెచ్‌సీలో వైద్యాధికారులతో విచారణ చేపట్టారు. పీహెచ్‌సీ ఆవరణలోని గోడౌన్‌లో ఉన్న మందులు కేవలం 104కి మాత్రమే చెందినవని, డక్కిలి పీహెచ్‌సీకి ఎటువంటి సంబంధం లేదని చెప్పారు.104 వాహన డ్రైవర్ కాలం చెల్లిన మందులను ట్రాక్టర్‌లో తీసుకెళ్లడం ఆదివారం జరిగిందన్నారు. ఈ మందులను ఆదివారం 6–30 గంటల సమయంలో తీసుకెళ్లడంతో సిబ్బందికి ఎవ్వరికీ తెలియదన్నారు. ఇటువంటి సంఘటనలు మరొకసారి చోటు చేసుకోకుండా వైద్యాధికారులు , సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా హెచ్చరించారు. విచారణ పూర్తయ్యే వరకు 104 వాహన డ్రైవర్‌ను సస్పెండ్‌చేసినట్లుగా 104 జిల్లా మేనేజర్ రాజేష్ వివరించారు. జరిగిన ఘటనపై సమగ్రంగా విచారణ చేపట్టి , విచారణ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం మందుల తరలింపుపై వైద్యాధికారులతో వివరించగా విచారణ జరిపారు. విచారణ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ విచారణలో వైద్యాధికారులు శ్రీహరి, బిందు ప్రియాంక, వైద్య సిబ్బంది ఉన్నారు.

### చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో నగరంలోని సీఆర్ఎస్ కాలనీకి చెందిన తీర్థం శంకర్ కు మూడు నెలల జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు.రాయల్ నగర్‌కు చెందిన పీవీ మధుసూదన్ రెడ్డి వద్ద తీర్థం శంకర్ 2020 ఆగస్టు 26వ తేదీ 5 లక్షలు రూపాయలు అప్పుగా తీసుకుని ప్రోనోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో శంకర్ 2021 మార్చి 20వ తేదీ 5 లక్షలా 65 వేల రూపాయలు విలువ చేసే చెక్కును మధుసూదన్ రెడ్డికి ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. దీంతో మధుసూదన్ రెడ్డి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకర్ కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

# శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,117 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,765 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


విరాళం డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

తిరుమల : రాజమండ్రికి చెందిన చిరంజీవి తలారీ హాశిత ఐశ్వర్య టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమలలోని చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఈ మేరకు విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

### తీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత కల్పించండి

తిరుపతి అర్బన్ : సముద్రతీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుగ్గిరాజుపట్నం కోస్టల్ పోలీస్‌స్టేషన్ మరమ్మత్తులు, కాంపౌండ్ వాల్ తదితర చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ అధికారి వెంకటరమణ, డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ బాలిరెడ్డి, కస్టమ్స్ ప్రివెంటివ్ డివిజన్ తిరుపతి అసిస్టెంట్ కమీషనర్ విజయ కుమార్, కోస్ట్ గార్డ్ అధికారి సురేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, మెరైన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### రెండిళ్లలో చోరీ

పాకాల : తాళాలు వేసిన ఇంటిని పసిగట్టి రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు నగలు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ యనమలవారిపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి, నాగేంద్రబాబు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగుల గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. నాగలక్ష్మి ఇంటిలో వెండి 60 గ్రాములు, 1 గ్రాము బంగారం , నాగేంద్ర ఇంటిలో 4 గ్రాముల బంగారం, 140 గ్రాముల వెండి నగలు అపహరించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇసుక అక్రమ రవాణాపై దాడులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

నాగలాపురం : రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. మండలంలోని మలిమేలు కండ్రిగ వద్ద అరణియార్ నదిలో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ సునీల్ సిబ్బందితో ఇసుక అక్రమ రవాణాదారులపై మెరుపు దాడి నిర్వహించి, ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై రాత్రి వేళలో ఇసుక తరలించిన ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

# ప్రయాణికుల కష్టాలు

- సీఎం సభకు బస్సులు.. ప్రయాణికుల వెతలు
- 364 ఆర్టీసీ బస్సులు అనంతపురానికి తరలింపు


తిరుపతి : బస్టాండ్‌లో బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షిస్తున్న ప్రయాణికులు


బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్ : సూపర్‌సిక్స్ విజయోత్సవ సభ బుధవారం అనంతపురంలో నిర్వహిస్తున్నారు. ఈ సభకు జిల్లా నుంచి 364 బస్సులను మంగళవారం తెల్లవారు జామున తరలించారు. జిల్లాలో 762 ఆర్టీసీ బస్సులు ఉంటే అందులో 50 శాతం సర్వీసులను అనంతపురంలో నిర్వహిస్తున్న సీఎం సభకు తరలించడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. జిల్లాలోని 11 డిపోల నుంచి బస్సులను అనంతపురానికి పంపించారు. ఒక్కో డిపో నుంచి 30 నుంచి 70 సర్వీసులను సభకు తరలించారు. సాధారణంగా తిరుమల బస్సులను ఏ సమావేశానికి ఎప్పుడూ పంపించిన సందర్భాలు లేవు. అయితే అనంతపురం సభకు తిరుమలకు వెళుతున్న 70 బస్సులను తరలించారు. తిరిగీ ఈ సర్వీసులు జిల్లాకు గురువారం వస్తాయని అధికారులు చెబుతున్నారు. సీఎం మీటింగ్ నేపథ్యంలో ప్రయాణికులకు మూడు రోజుల పాటు కష్టాలు తప్పడం లేదు. . తిరుపతి బస్టాండ్‌లో మంగళవారం బస్సుల కోసం గంటల కొద్ది ప్రయాణికులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ముందస్తు సమాచారం లేకుండా ఆర్టీసీ అధికారులు ఇలా అడ్డదిడ్డంగా మీటింగుల పేరుతో బస్సులను పక్క జిల్లాకు తరలించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ఫొటో, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ , గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 15వ తేదీ (సోమవారం) నుంచి 31 రోజుల పాటు పురుషులు, మహిళలకు ఫొటో, వీడియోగ్రఫీపై ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ , రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

### దాచూరులో మత్స్యకారుల మధ్య ఉద్రిక్తత

కలువాయి (సైదాపురం) : కలువాయి మండలం దాచూరులో మత్స్యకారుల మధ్య మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. సభ్యత్వం లేని మత్స్యకారులు దాచురులో అలివి వలలు వేసి దొంగచాటుగా వేట సాగిస్తూ చేపలు పడుతున్నారని సమాచారం రావడంతో సభ్యత్వం ఉన్న మత్స్యకారులు, అలివి వలలతో పట్టిన 2 టన్నుల చేపలు ఎండబెట్టినట్లు గుర్తించారు. దీంతో గిరిజన మత్స్య కారుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ్యత్వం లేని వారు అక్రమంగా చేపలు పట్టడం వల్ల తమ జీవనాధారం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో ఇరువర్గాల మత్స్యకారులు పాత దాచూరుకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.